సాక్షి
పెద్దపల్లి

ఆదివారం । 5 । నవంబర్ । 2023



వేద విద్యార్థుల శోభాయాత్ర

మంథని: స్థానిక నృసింహ గార్డెన్‌లో మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ స్థాయి వేదసభల సందర్భంగా శనివారం రాత్రి మంత్రపురి వీధుల్లో వేద విద్యార్థులు, మహిళలు పెద్దఎత్తున శోభాయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల నుంచి వచ్చిన సుమారు 500 మంది వేద విద్యార్థులతో ప్రదర్శన నిర్వహించడడంతో మంత్రపురిలో వేదఘోష ఫరిడవిల్లింది.

నామినేషన్ల వివరాలు.. 2వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
పెద్దపల్లి	01	01
రామగుండం	02	02
మంథని	01	01

న్యూస్‌రీల్

అవినీతికి ఆస్కారం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: అవినీతికి ఆస్కారం ఇవ్వకుండా ప్రభుత్వ ఉద్యోగులు సేవలు అందించాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. లంచం ఇవ్వడం, తీసుకోవడం రెండూ నేరమేనన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని సూచించారు. డిపో మేనేజర్ నాగభూషణం, లోక్ అదాలత్ సభ్యుడు శంకర్, న్యాయవాదులు ఆరె.మధు, ప్రవళిక, లీగల్ వలంటీర్ సుజాత, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు జలకళ



రామగుండం: ఎల్లంపల్లి ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వలు ఉన్నాయని నీటి పారుదలశాఖ అధికారులు శనివారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వల సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా అంతే మొత్తంలో నీటినిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎగువ నుంచి 2,562 వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉందని, రెండుగేట్లు ఎత్తి అంతేమొత్తంలో దిగువకు విడుదల చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

ఆహారపు అలవాట్లతో ఆరోగ్యం



స్థల పరిశీలన చేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌లాల్

ఫెర్టిలైజర్‌సిటీ: విద్యార్థులు చిన్నతనం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్ సూచించారు. పాలకుర్తి మండలం ఎల్కలపల్లి– ఎఫ్‌సీఐ జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. కిచెన్ గార్డెన్ ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. స్థల పరిశీలన చేశారు. కిచెన్ గార్డెన్‌లో సేంద్రియ ఎరువులతో కూరగాయలు, పండ్లు పండించి విద్యార్థులకు అందిస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయురాలు హేమలత తదితరులు పాల్గొన్నారు.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

గోదావరిఖనిటౌన్: కార్తీక మాసం సందర్భంగా శ్రీశైలం, అరుణాచలం, వేములవాడ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను అద్దెకు ఇస్తామని ఖని డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. అయ్యప్ప భక్తుల కోసం శబరిమలకు కొత్త బస్సులు అందుబాటులో ఉంచామన్నారు. పెళ్లిళ్లకు, విహారయాత్రలకు కూడా అద్దె ప్రాతిపదికన ఇస్తామని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 73828 47316, 97043 30086, 73828 47427 మొబైల్ నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఏఐసీసీ ఇన్‌చార్జిల నియామకం

పెద్దపల్లిరూరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పరిశీలకులను నియమించిందని ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గానికి సలీం అహమద్, చొప్పదండికి రూపకల, మానకొండూరుకు బసనగౌడ దద్దల్, హుస్నాబాద్‌కు సునీల్ గౌడ పాటిల్, ధర్మపురికి బసనగౌడ తుర్విహాల్‌ను నియమించినట్లు ఆయన పేర్కొన్నారు.

సమస్య పరిష్కరించండి

పెద్దపల్లిరూరల్: ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామానికి చెందిన ఆవునూరి లచ్చయ్య భూవివాదం, నిర్వహణ కేసును నాలుగు వారాల్లో పరిష్కరించాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసిందని న్యాయవాది కొప్పుల శ్రావణ్‌కుమార్ శనివారం తెలిపారు. మెయింటనెన్స్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్టు కింద దరఖాస్తు చేసుకుని పది నెలలు గడచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ లచ్చయ్య హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. నాలుగు వారాల్లో సమస్యకు పరిష్కారం చూపాలని ఆర్డీవోను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సోషల్ వార్



ఏప్రిల్ ఒకటిన ఒకరోజు ఫూల్ అయితే పర్వాలేదు.. నవంబర్ 30న అవినీతి పరులకు ఓటువేసి ఐదేళ్లు ఫూల్ కావొద్దు.. అభివృద్ధి చేసే మా పార్టీకే ఓటు వేయండి.
– ఇది అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థి ఫేస్‌బుక్ పేజీలోని సందేశం

ఎన్నికల రోజున పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓట్లు వేయడం సహజమే.. కానీ సామాజిక మాధ్యమాల్లో ఏరోజుకారోజు పోలింగ్ జరుగుతూనే ఉంది. అభ్యర్థుల వివరాలను ఫేస్‌బుక్ పేజీలో పొందుపరుస్తూ ఓటు ఎవరికి వేస్తారని ప్రశ్నిస్తున్నారు.

దేశం కోసం ఆర్మీలో చేరి శత్రుసైన్యంపై బుల్లెట్ల వర్షం కురిపించాలనుకుంటున్నారా.. అయితే మీరు ఇప్పటికిప్పుడు సైన్యంలో చేరాల్సిన అవసరం లేదు.. శత్రుదేశంలోకి చొచ్చుకెళ్లి బుల్లెట్లు కురిపించే మా పార్టీకి ఓటు వేయండి.. ఆ ఓటే బుల్లెట్ అవుతుంది.
– ఇది మరో పార్టీ అభ్యర్థి ఫేస్‌బుక్‌లోని మెసేజ్

- సామాజిక మాధ్యమాలే ప్రచార వేదికలు
- ఆరోపణలు, ప్రత్యారోపణలతో వేడెక్కుతున్న రాజకీయం
- సాంకేతికతను వినియోగిస్తున్న అన్ని పార్టీల అభ్యర్థులు

జంగ్ తెలంగాణ

సాక్షి, పెద్దపల్లి: ఎన్నికల ప్రచారంలో సామాజిక మాధ్యమాల ప్రభావం బాగా పెరిగిపోతోంది. దాదాపు అన్ని రాజీకయ పార్టీల నేతలు తమ ప్రచారం కోసం సోషల్ మీడియాను అధికంగా వినియోగిస్తున్నారు. ఇందుకోసం నాయకులే కాదు.. కార్యకర్తలు కూడా తమ పట్టణాలు, గ్రామాల్లో వాట్సప్ గ్రూపులు, ఫేస్‌బుక్‌ల్లో పేజీలు క్రియేట్ చేస్తున్నారు. తమ నాయకుడు చేసిన పనులు, ఇస్తున్న హామీలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. ఆయా పార్టీల అభ్యర్థులు సోషల్ మీడియా టీంలను ఏర్పాటు చేస్తూ మరీ జోరుగా ఎన్నికల ప్రచారం చేసుకుంటున్నారు.

కామెంట్లు.. కౌంటర్లు..

- అభ్యర్థుల పేజీలు, నియోజకవర్గాల పేర్లతో నేతల పోస్టులకు కామెంట్లు, కౌంటర్లు పెడుతూ.. తమ పార్టీ అభ్యర్థి గుణగణాలు, ఎదుటివాళ్ల లోపాలనూ చెబుతూ కామెంట్లు పోస్టు చేస్తున్నారు.
- ఐదేళ్ల క్రితం ఇలా ఉండేది, ఇప్పుడు ఇదిగో ఇలా మార్చాం.. ఈఘనత మా అభ్యర్థిదే.. ఇలాంటివి ఎన్నో చేశాం.. ఇకముందు మరెన్నో చేస్తాం.. అభివృద్ధికి చేయూతనివ్వండి.. అని ప్రచారం చేస్తున్నారు.
- ఇలాంటి వాటిపై పార్టీ అనుచరులు జయహో అంటుంటే.. ప్రత్యర్థులు వ్యతిరేక కామెంట్లు విసురుతున్నారు.

యువతను ఆకట్టుకోవడానికే..

గెలుపోటములను ప్రభావితం చేసేంతగా యువ ఓటర్లు ఉన్నారు. వీరు సామాజిక మాధ్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు ప్రచార చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో అప్‌డేట్ చేస్తున్నారు.

అదుపు తప్పుతున్నాయ్..

- విమర్శలకైనా, ఆరోపణలకైనా ఒక హద్దు ఉంటుంది.
- ప్రత్యర్థిపై ఆరోపణలు, విమర్శల దాడి చేసే ముందు ఆ అంశానికి సంబంధించిన ఆధారం కూడా ఉండాలి.
- కానీ, ఇవేవీ పట్టించుకోకుండా చాలా మంది సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా కామెంట్లు, కౌంటర్లు పోస్టు వైరల్ చేస్తున్నారు.
- ఇవి కాస్త విషమంగా మారుతున్నాయి.
- వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ పేజీల్లో కొన్నిసార్లు వరుస కామెంట్లు చూస్తుంటే అక్షరాల ద్వారా చేస్తున్న వీధి పోరాటాలను తలపిస్తున్నాయి.
- కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సోషల్ మీడియాపై నిఘా ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తున్నా సోషల్‌వార్‌కు అడ్డుకట్ట పడడంలేదు.

ఉమ్మడి జిల్లాలో 7 నుంచి కేసీఆర్ పర్యటన



సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీఆర్‌ఎస్ ప్రచారాన్ని ముమ్మరంచేసింది. విపక్షాల కంటే ఎన్నికల ప్రక్రియలో ఒక అడుగు ముందుండేలా వ్యూహం అమలుచేస్తోంది. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించిన గులాబీ బాస్ ఎన్నికల ప్రచారమూ ముమ్మరం చేశారు. ఇప్పటికే కేసీఆర్ ఉమ్మడి జిల్లాలో పలునియోజకవర్గాలను చుట్టేశారు. రెండో విడతలో మిగతా నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు.

బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ సభలు ఇలా..

తేదీ	నియోజకవర్గం
7న	మంథని, పెద్దపల్లి
17న	కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్
20న	మానకొండూరు
24న	రామగుండం
26న	జగిత్యాల, వేములవాడ

కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వొద్దు



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

సుల్తానాబాద్(పెద్దపల్లి): కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే రాష్ట్రం సర్వనాశనం అవుతుందని సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని రవీందర్ సింగ్ పేర్కొన్నారు. ఆయనను మూడోసారి సీఎంను చేయాలని కోరారు. ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని మూడోసారి గెలిపించుకోవాలని కోరారు. తెల్లరేషన్ కార్డుదారులకు సన్నబియ్యం అందిస్తామని, ఆసరా పింఛన్లు పెంచే బాధ్యత ప్రభుత్వం తీసుకుందని వివరించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పారుపెల్లి గుణపతి, మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత, రైతు సమన్వయ సమితి జిల్లా కోఆర్డినేటర్ పాల రామారావు, నాయకులు బుర్ర మౌనిక, ఐల రమేశ్, అరుణ, తిరుపతి, గోపి, శ్రీనివాస్, మమత, పల్లా సురేశ్, సూర శ్యామ్, తిప్పారపు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

మీకు తెలుసా?

0 శాసనసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులకు స్థానమివ్వని నియోజకవర్గం చొప్పదండి. ఇక్కడ 13సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరగగా స్వతంత్ర అభ్యర్థులుగా పలువురు పోటీ చేసినా ఓట్లను రాబట్టుకోలేకపోయారు.

1 ఉమ్మడి జిల్లా నుంచి ఒక్కరే అత్యున్నత ప్రధానమంత్రి పీఠాన్ని అధిష్టించారు. పాత కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పాములపర్తి వెంకట నర్సింహారావు మంథని ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలుపొందగా హన్మకొండ, రాంటెక్, ఒడిశా, నంద్యాల నుంచి ఎంపీగా నిలిచి ప్రధానమంత్రి పదవిని నిర్వహించి దేశవ్యాప్త కీర్తి గడించారు.

ఉమ్మడి కరీంనగర్ చరిత్రలో ఒకరే ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ధర్మారావు స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.

2 ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పీవీ నర్సింహారావు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ముస్తాబాద్ మండలం మోహినికుంటకు చెందిన కేసీఆర్ ముఖ్యమంత్రిగా రెండుసార్లు వ్యవహరించగా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా చరిత్రలో మహిళా ఎమ్మెల్యేలుగా గెలిచింది ఇద్దరే. మెట్‌పల్లి నుంచి కొమొరెడ్డి జ్యోతి, చొప్పదండి నుంచి బొడిగె శోభ.

3 ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు పౌరసరఫరాల శాఖ మంత్రులుగా వ్యవహరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈటల రాజేందర్, గంగుల కమలాకర్ సివిల్ సప్లయ్ మినిస్టర్లు వ్యవహరించారు.

4 ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఎంపీగా గెలిచిన అరుదైన వ్యక్తిగా పీవీ నర్సింహారావు సత్తాచాటారు. నాలుగుచోట్ల నాలుగు సార్లు ఎంపీగా గెలిచారు. తొలుత హన్మకొండ నుంచి ఎంపీగా గెలుపొందగా తదుపరి జరిగిన ఎన్నికల్లో రాంటెక్, నంద్యాల, ఒడిశా నుంచి గెలుపొందారు.

నలుగురు తండ్రి కొడుకులు ఎమ్మెల్యేలుగా గెలుపొందారు. కేసీఆర్, అతని కుమారుడు కేటీఆర్, శ్రీపాదరావు ఇతని కుమారుడు శ్రీధర్‌బాబు, చెన్నమనేని రాజేశ్వర్‌రావు ఇతని కుమారుడు రమేశ్‌బాబు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, అతని తనయుడు సతీష్‌కుమార్ ఎమ్మెల్యేగా వ్యవహరించారు. – కరీంనగర్ అర్బన్

ప్రచారానికి అందని మంథని

- తెలంగాణలోనే అధిక విస్తీర్ణం
- నియోజకవర్గం పొడవు 180 కి.మీ.



మంథని: దట్టమైన అడవులతో నిండి ఉన్నమారుమూల ప్రాంతం మంథని నియోజకవర్గం. ఇది మావోయిస్టుల కంచుకోటగా పోలీసు రికార్డుల్లో ఉంది. వీటితోపాటు మరో ప్రత్యేకత కూడా దీనికి ఉంది. తెలంగాణలోని నియోజకవర్గానికీ ఇంతటి విశిష్టత లేదు. సుమారు 300 గ్రామాలు, 2.30లక్షల మంది ఓటర్లు కలిగి ఉంది. భౌగోళికంగా 180కిలో మీటర్ల పొడవు, సుమారు 40 కిలో మీటర్ల వెడల్పుతో విస్తరించి ఉంది. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల పరిధిలో ఉంది. జిల్లాకేంద్రం పెద్దపల్లికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలోని సబ్బితం వద్ద ప్రారంభమయ్యే మంథని నియోజకవర్గ ప్రస్థానం.. మహదేవపూర్ మండలం చరిత్రాత్మక కట్టడమైన ఇచ్చంపల్లికి సమీపంలోని ముకునూరు వరకు 180కిలో మీటర్ల మేర విస్తరించడం విశేషం.

ప్రచారం కత్తిమీద సాములాంటిదే..

అక్కడక్కడా ఏరివేసినట్లు ఉన్న పల్లెలతో రవాణా సౌకర్యం సరిగా లేని మంథని నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం నిర్వహించాలంటే అన్ని రాజకీయ పార్టీలకు కత్తిమీద సాములాంటిదే.

- మంథని బరిలో నిలిచే అభ్యర్థులు బీ ఫారం చేతికొచ్చాకే ప్రచారం నిర్వహించాలంటే పప్పులో కాలేసినట్లే.
- ఈనెల 30న పోలింగ్ నిర్వహించనున్నారు.
- గడువు సుమారు 25రోజుల వరకే ఉంది.
- ఈలోగా ఇంతపెద్ద నియోజకవర్గాన్ని కనీసం ఒక్కసారైనా ప్రచారంలో భాగంగా చుట్టి రావడం అన్ని రాజకీయ పార్టీలకు కష్టమే.
- మొత్తం పది మండలాలను తన మదిలో పెట్టుకొని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తున్న మంథని నియోజకవర్గం.. అన్ని సామాజిక వర్గాలకు పెట్టని కోట లాంటిది.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓటర్లు కీలక తీర్పు ఇచ్చే ఈ నియోజకవర్గం దశాబ్దాల నుంచి నక్సల్స్ గ్రూపుల ఉత్పత్తి కేంద్రంగా కూడా ప్రసిద్ధి చెందింది.
- అన్ని రాజకీయ పార్టీల పూర్తిస్థాయి ప్రచారానికి అందనంత దూరంలో ఉంటున్న ఈ నియోజకవర్గం ఎన్నికల తీర్పు మాత్రం తనదైన శైలిలో ఇచ్చుకుంటూ వస్తోంది.

సజావుగా నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ

- జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్



కార్యాలయం తనిఖీ చేస్తున్న ముజమ్మిల్‌ఖాన్

గోదావరిఖని: సజావుగా నామినేషన్ల ప్రక్రియ జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. రామగుండం రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. నామినేషన్ ప్రక్రియ సజావుగా సాగేందుకు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, పోస్టల్ బ్యాలెట్, ఈటీపీబీఎస్‌లను, ప్రీ సర్టిఫికేషన్ డెస్క్, నామినేషన్ ఫారం మంజూరు డెస్క్, ఎన్కోర్ ఆన్‌లైన్ ఎంట్రీపై సూచనలు చేశారు. అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ అబ్జర్వర్ వద్ద అభ్యర్థుల వ్యయ వివరాలు నమోదుపై పలు సూచనలు చేశారు, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ స్వీకరణ ప్రక్రియ జరగాలన్నారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ వంద మీటర్ల పరిధిలో ఎలాంటి ర్యాలీలను అనుమతించ రాదని, రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ అధికారులు ఉన్నారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మహిళలతో ఎమ్మెల్యే చందర్, నాయకులు

గోదావరిఖని: మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. తిలక్‌నగర్‌డౌన్‌లోని విశ్వం కమ్యూనిటీహాల్లో 36డివిజన్‌కు చెందిన పలువురు మహిళలు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మీరుణం తీర్చుకోవడానికి మెడికల్ కళాశాల మంజూరు చేయించానని తెలిపారు. అభివృద్ధిని చూసి ఓర్వలేని కాంగ్రెస్ నాయకులు దుర్మార్గమైన ప్రచారం చేస్తోందని విమర్శించారు. ఈ ఊరులో ఉండనివాళ్లు, ఊరుకు ఏమీ చేయనివారు కూడా ప్రజలను మోసగించేందుకు మాయమాటాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కారుగుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని చందర్ కోరారు. నాయకులు కర్క శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మూల విజయారెడ్డి, బాల రాజ్‌కుమార్, చెలకలపల్లి శ్రీనివాస్, జేవీ రాజు, వ్యాల్ల హరీశ్‌రెడ్డి, అనుముల కళావతి తదితరులు పాల్గొన్నారు.

అన్ని కులాలకు ప్రాధాన్యం

అన్నికులాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కోరుకంటి చందర్ అన్నారు. విశ్వం కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఆరెకటికల ఆత్మీయ సమ్మేళనంలో ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి చందర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆరెకటికలు మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు గౌలికార్ రాము, బోడెల్లి అశోక్, కిరణ్‌జీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌బాబు నామినేషన్



మంథని: కాంగ్రెస్ అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు శనివారం సాదాసీదాగా నామినేషన్ దాఖలు చేశారు. తొలుత కన్నాల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంతోపాటు మహాలక్ష్మీ దేవాలయంలో ప్రత్యేకపూజలు చేశాక ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. ప్రముఖ న్యాయవాది చంద్రుపట్ల రమణకుమార్‌రెడ్డి, బెల్లంకొండ కిష్టయ్య, సింగారపు కిష్టయ్య, లైశెట్టి రాజుతో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు.

అత్యవసర వైద్యసేవలపై నిర్లక్ష్యం!

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖనిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో అత్యవసర వైద్య సేవలపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. కొందరు వైద్యుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందనే విమర్శలు వస్తున్నాయి. ప్రాణాపాయంలో ఉన్నవారు వస్తే కొత్త బ్లాక్‌లోకి వెళ్లాలని పాతబ్లాక్‌లోని వారు, పాత బ్లాక్‌లోకి వెళ్లాలని కొత్త బ్లాక్‌లోని వైద్యులు పేషెంట్ల సంబంధీకులకు సూచించడంతో మధ్యలోనే ప్రాణాలు పోతున్నాయి. శుక్రవారం ఫైవింక్లయిన్ ఏరియాకు చెందిన యువకుడు పానగంటి శ్రీనివాస్ ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పాతబ్లాక్‌లో ఈసీజీ, ఎక్స్‌రే తీయించిన డాక్టర్లు.. కొత్త బ్లాక్‌లోకి వెళ్లాలని సూచించారు. కొత్త బ్లాక్‌లోకి వెళ్లగానే.. శ్రీనివాస్, కుర్చీలోంచి అకస్మాత్తుగా కింద పడిపోయాడు. అక్కడి సిబ్బంది ఒక్కరూ స్పందించలేదని, ఓ స్నేహితుడి సాయంతో స్ట్రెచర్‌పై పాత బ్లాక్‌కు తీసుకొచ్చినట్లు పేషెంట్ అన్న కుమారుడు డార్విన్ కన్నీటిపర్యంతమయ్యాడు. పాత బ్లాక్‌లో స్పందించిన డాక్టర్లు వెంటనే సీపీఆర్ చేసి బతికించేందుకు యత్నించినా.. అప్పటికే చనిపోయాడని, దీనికి సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యమే కారణమని డార్విన్ ఆరోపించాడు. ఈ విషయంపై ఆర్‌ఎంవో అరుణ, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ అశోక్‌ను సంప్రదించగా.. ఛాతినొప్పితో వచ్చే పేషెంట్లను పాత బ్లాక్‌లోనే పరీక్షిస్తున్నామన్నారు. కొత్త బ్లాక్‌కు పంపవద్దని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. శ్రీనివాస్ విషయంలో నిర్లక్ష్యం జరగలేదని, అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిందని, వైద్యం అందించామని, అప్పటికే మృతి చెందాడని పేర్కొన్నారు. ఎమర్జెన్సీ సేవలు పొందే విభాగం గురించి ప్రజలకు తెలిసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి రాజ్‌ఠాకూర్



పార్టీలో చేరిన నాయకులతో రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బీఆర్‌ఎస్‌తోపాటు పలువురు నాయకులు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఠాకూర్.. స్థానిక ఎమ్మెల్యే చేసిన పనులు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ప్రజలు, విద్యార్థులు, యువకులు, మహిళలు, కార్మికులు తనను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు దీటి బాలరాజ్, ఉల్లంగుల రమేశ్, కృష్ణస్వామి, కుమార్, ఖాదిర్, టీబీజీకేఎస్ నాయకుడు ఐ.రాజేశం కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఉన్నారు. 39వ డివిజన్‌కు చెందిన కలువల రమేశ్, కుమ్మరికుంట మల్లయ్య, తుమ్మ రాజయ్య, రాజేందర్, జంగ రామకృష్ణారెడ్డి, ప్రభాకర్,కొమురయ్య, కూరపాటి ప్రభాకర్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

కాంగ్రెస్‌లో న్యాయవాదుల చేరిక..

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్ కొప్పుల శంకర్ ఆధ్వర్యంలో సుమారు 30మంది న్యాయవాదులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పకడ్బందీగా ఎన్నికల వ్యయం నమోదు

పెద్దపల్లిరూరల్: రాజకీయ పార్టీలు, అభ్యర్థులు చేసే ఎన్నికల ఖర్చును పక్బందీగా నమోదు చేయాలని పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు ఆశిష్‌యాదవ్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో అధికారులతో వ్యయంపై సమీక్షించారు. అధికారులు సమన్వయంతో పని చేస్తూ వాస్తవాలపై దృష్టి సారించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద సీసీ కెమెరాల పర్యవేక్షలో నిరంతరం తనిఖీలు చేయాలన్నారు. నిబంధనలకు లోబడి వ్యవహరించాలని సూచించారు. అనంతరం ఫిర్యాదుల పర్యవేక్షణ కేంద్రాన్ని సందర్శించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 1950 టోల్‌ఫ్రీ, సీ విజిల్‌యాప్, సోషల్‌మీడియా మానిటరింగ్, ఎలక్ట్రానిక్ మీడియా మానిటరింగ్ కమిటీల పని తీరు పర్యవేక్షించారు. డీసీవో శ్రీమాల, ఏసీపీ మహేశ్, అసిస్టెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు రవిబాబు, ఐటీ అధికారి లంకావలన్ పాల్గొన్నారు.

నోట్ల కట్టలతో వస్తున్నారు.. జాగ్రత్త



చిన్నారిని పలకరిస్తున్న పుట్ట మధు

మంథని: నోట్ల కట్టలతో ఓట్ల కోసం వస్తున్నారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని మంథని బీఆర్‌ఎస్ అభ్యర్థి పుట్ట మధు కోరారు. బోయిన్‌పేట, గొల్లగూడెంలో శనివారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మాట్లాడారు. మనఓట్లతో ఐదేళ్లు ఎమ్మెల్యేగా కొనసాగి, మా ప్రభుత్వం లేదు, మాకు పవర్ లేదన్నోళ్లకు ఎన్నికలు రాగానే డబ్బు ఎక్కడినుంచి వచ్చిందో ఆలోచన చేయాలని కోరారు. తమ ప్రభుత్వం లేదని చెప్పి కమ్యూనిటీ హాల్‌కు నిధులు ఎక్కడి నుంచి తీసుకొచ్చారని ప్రశ్నించారు. 2018లో దుష్ప్రచారాలతో తనను ప్రజలకు దూరం చేశారని, మళ్లీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని మధు విమర్శించారు. ఈ ఎన్నికల్లో తనను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మధు కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మంథని: గాజులపల్లి గ్రామానికి చెందిన రోద్ద ఆదర్శ్(22) శుక్రవారం రాత్రి ఊరుబయటి రోడ్డు పక్కన చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి తండ్రి లింగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... లింగయ్యకు ఇద్దకు భార్యలు కాగా, రెండో భార్య కుమారుడైన ఆదర్శ్.. కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం కారు డ్రైవర్‌గా వెళ్తున్నానని ఇంట్లో తల్లి పూర్ణిమకు చెప్పాడు. ఎంతకీ తిరిగిరాలేదు. శనివారం ఉదయం ఊరు బయట రోడ్డు పక్కన చెట్టుకు ఉరివేసుకొని చనిపోయాడు. అయితే, తన కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని, పూర్తిస్థాయిలో విచారణ చేయాలని మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్సై కిరణ్ కేసు నమోదు చేసుకున్నారు

వ్యక్తి ఆత్మహత్య

పెద్దపల్లిరూరల్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి ఓ వ్యక్తి(55) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వేహెడ్ కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆ వ్యక్తి ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడని పేర్కొన్నారు. మృతుడు ఎర్రని చొక్కా, బూడిద రంగు ప్యాంటు ధరించాడని, నలుపు, తెలుపు గడ్డం ఉందన్నారు. ఆచూకీ తెలిసిన వారు 87126 58596, 99484 81902 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

సుల్తానాబాద్‌రూరల్: గట్టెపల్లి గ్రామానికి చెందిన యువకుడు కోడి సాయికుమార్ శనివారం రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డాడు. ద్విచక్ర వాహనంపై గర్రెపల్లి నుంచి సుల్తానాబాద్‌కు వస్తున్న క్రమంలో కాట్నపల్లి వద్ద రాజీవ్ రహదారిపై ఆగిఉన్న లారీని ఢీకొట్టడంతో యువకుడికి స్వల్ప గాయాలైనట్లు పోలీసులు తెలిపారు.

గీతకార్మికుడి మృతి



ఓదెల(పెద్దపల్లి): బీమరిపల్లె గ్రామంలో రంగు రాయమల్లు(55)అనే గీతకార్మికుడు ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచిపడి శనివారం మృతిచెందాడు. రోజు మాదిరిగా తాటిచెట్టు ఎక్కడానికి వెళ్లిన రాయమల్లు.. చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలపగిలి చనిపోయాడు. పొత్కపల్లి పోలీసులు కేసునమోదు చేసుకున్నారు.



విజయరమణారావు నామినేషన్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చింతకుంట విజయరమణారావు శనివారం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుమోహన్ తెలిపారు. విజయరమణారావు తరఫున మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజయ్య, నాయకులు మస్రత్, అన్నయ్యగౌడ్ నామినేషన్ పత్రాలు అందించారని పేర్కొన్నారు.





నామినేషన్ దాఖలు చేసిన సంధ్యారాణి

గోదావరిఖని: భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కందుల సంధ్యారాణి రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం తన నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి ముడిమల్ల కీర్తికాంత్ నామినేషన్ వేసినట్లు రిటర్నింగ్ అధికార జె.అరుణశ్రీ తెలిపారు. ఇద్దరు అభ్యర్థులు ఒక్కోసెట్ నామినేషన్ వేసినట్లు వివరించారు. నియోజకవర్గంలో రెండురోజుల్లో నలుగురు అభ్యర్థులు నామినేషన్ వేసినట్లు వెల్లడించారు.

పోలింగ్ శాతం పెంపే లక్ష్యం

- ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు
- రామగుండం రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ



మాట్లాడుతున్న అరుణశ్రీ, హాజరైన అధికారులు

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని రామగుండం అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ అన్నారు. ఎన్టీపీసీ టెంపరరీ టౌన్‌సిప్ మిలీనియం హాల్‌లో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు కుమారస్వామి, జ్యోతి, రామ్మోహన్‌రావు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్, మీడియా, కమ్యూనికేషన్ ప్లాన్ నోడల్ అధికారి రజనితో కలిసి ఆమె మాట్లాడారు. పోలింగ్‌శాతం అత్యధికంగా నమోదయ్యేలా స్వీప్ ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అక్టోబర్ 30లోపు ఆన్‌లైన్ పేరు నమోదు చేసుకున్న ప్రతీఒక్కరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి అర్హులని తెలిపారు. నియోజకవర్గంలో 2,14,974 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 1,08,233 మంది, మహిళలు 1,06,716 మంది, థర్డ్ జెండర్లు 25 మంది ఉన్నారని, వీరికోసం 259 పోలింట్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు గడువు ఉందన్నారు. ఎన్టీపీసీ టీటీఎస్ జెడ్పీహెచ్ఎస్‌లోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు.

రూ.50వేలకు పైగా తీసుకెళ్తే జప్తు

రూ.50వేల కన్నా ఎక్కువమొత్తం తరలిస్తే జప్తు చేయనున్నామని అరుణశ్రీ తెలిపారు. నగదుకు కచ్చితంగా రశీదు వెంట ఉంచుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ సూచించారు.

10వరకు నామినేషన్లు స్వీకరణ..

ఈనెల 3న ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని, నామినేషన్ అఫిడవిట్ల వివరాలను వెంటనే వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామని రిటర్నింగ్ ఆఫీసర్ తెలిపారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు అనుమతి ఉందని వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులకు రెండోవిడత శిక్షణ ఇస్తున్నామని అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు..

రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఆడియో, వీడియో యాడ్స్, వీడియోలు, పాటలకు డీపీఆర్‌వో ఆధ్వర్యంలోని మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్(ఎంసీఎంసీ)కమిటీ ఆమోదం తీసుకోవాలని అరుణశ్రీ సూచించారు. అనుమతి లేకుంటే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు 1950నంబరు అందుబాటులో ఉందని తెలిపారు. అధిక పోలింగ్ శాతం నమోదయ్యేలా, పారదర్శకంగా పోలింగ్ నిర్వహించేలా అందరూ సహకరించాలని ఆమె కోరారు.

తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్సే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్‌కు ఒక్కసారి అధికారం ఇవ్వాలని కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటీ చైర్మన్, మంథని ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. శనివారం నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మంథనిలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ వచ్చాక రెండుసార్లు అధికారంలో ఉన్న టీఆర్ఎస్ అభివృద్ధిని విస్మరించిందని విమర్శించారు. పదేళ్లలో సాధించింది శూన్యమే అని అన్నారు. మంథని నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం కోసం తాను పాటుపడినట్లు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనానికి ఖని న్యాయవాదులు



హైదరాబాద్ బయలుదేరుతున్న న్యాయవాదులు

గోదావరిఖనిటౌన్: హైదరాబాద్ జలవిహార్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి గోదావరిఖనికి చెందిన బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో తరలివెళ్లారు. గోదావరిఖని కోర్టు కాంప్లెక్స్ ఎదుట న్యాయవాదులు బయలుదేరే బస్సును నియోజకవర్గ ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్, బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు మేడ చక్రపాణి, ఉపాధ్యక్షులు రాకం దామోదర్, నడిపెల్లి కిషన్‌రావు, కొప్పుల నరేశ్‌కుమార్, సలహాదారులు ముచ్చకుర్తి కుమార్, నాయకులు గోషిక ప్రకాశ్, ఎరుకల ప్రదీప్‌కుమార్, ఎండీ ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత రామగుండంగా తీర్చిదిద్దుతా

- బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి



మాట్లాడుతున్న సంధ్యారాణి

గోదావరిఖని: రామగుండం నియోజకవర్గంలో బీజేపీని గెలిపిస్తే అవినీతిరహితంగా తీర్చిదిద్దుతానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి హామీ ఇచ్చారు. శనివారం జీడీకే–5 ఓసీపీ, స్థానిక 32డివిజన్‌లో ప్రజాఆశీర్వాద యాత్ర నిర్వహించారు. తెలంగాణ ప్రజలు రామగుండం వైపు చూస్తున్నారన్నారు. రూ.కోట్ల నాయకులకు, సామాన్య, పేద మహిళకు మధ్య ఎన్నికల యుద్ధం నడుస్తోందన్నారు. ఇప్పటికే ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉద్యోగాల పేరిట స్థానిక నాయకుడు ప్రజలను మోసం చేసి ఎంతోమంది ఆత్మహత్యలకు కారణమయ్యారని ఆరోపించారు. నాయకుడు కొండపర్తి సంజీవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మెరుగు హనుమంత్‌గౌడ్, గాండ్ల ధర్మపురి, జక్కుల నరహరి, మూకిరి రాజు, మహావాది రామన్న, మాతంగి రేణుక, గోపగోని నవీన్, బీఎంఎస్ నాయకులు యాదగిరి సత్తయ్య, పెండ్యం సత్యనారాయణ, శ్రీనివాస్, దొమ్మేట నరేందర్, రంజిత్‌కుమార్, మామిడి రమేశ్, శ్రీనివాస్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

పనులు చేస్తా.. ఓటెయ్యండి

రామగుండం నియోజవర్గ బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి మట్టి ఎత్తుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక ఎల్‌బీనగర్‌లో శనివారం ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో మట్టి పనిచేస్తున్న ఓటర్లను కలిసి తనకే ఓటు వేయాలని మట్టి పనిలో ఇలా సాయం చేశారు.



ఆయాలు లేరు.. తిప్పలు తప్పవు

రామగిరి మండలం లద్నాపూర్‌లో మూడు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఒకదాంట్లో టీచర్, ఆయా కొరత వేధిస్తోంది. మరో రెండు కేంద్రాలు ఒకేసెంటర్‌లో కొనసాగుతున్నాయి. ఇక్కడ సహాయక సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడంలేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సింగరేణి కార్మికుని బలవన్మరణం

- కళ్లు దానంచేసిన కుటుంబ సభ్యులు
- కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు



రాజ్‌కుమార్(ఫైల్)

గోదావరిఖని: స్థానిక కాకతీయనగర్‌లో ఉంటూ జీడీకే–1వ గనిలో పనిచేస్తున్న కాటిపల్లి రాజ్‌కుమార్(38) శనివారం ఉరివేసుకుని మృతి చెందినట్లు ఎస్సై సమ్మయ్య తెలిపారు. రాజ్‌కుమార్‌కు ఎనిమిదేళ్లక్రితం వివాహం జరిగిందన్నారు. కూతురు(6), కుమారుడు(6) ఉన్నారన్నారు. ఆర్నెల్ల క్రితం వరకు రాజ్‌కుమార్ మద్యం విపరీతంగా తాగేవాడని, ఆ తర్వాత మద్యం మానేశాడని, దీంతో వింతగా ప్రవర్తించడం ప్రారంభమైందని తెలిపారు. కరీంనగర్‌లోని మానసిక వైద్య నిపుణుడికి చూపించినా, మందులు సరిగా వాడకపోవడంతో మతిస్థిమితం కోల్పోయాడన్నారు. ఈక్రమంలో శుక్రవారం డ్యూటీకి వెళ్లి వచ్చి పడుకున్నాడన్నారు. శనివారం ఉదయం 6గంటలకు భార్య లేచి చూసేసరికి ఇంటి పక్కగల రేకుల షెడ్‌లో ఐరన్‌రాడ్‌కు నైలాన్ తాడుతో ఉరివేసుకొని చనిపోయాడన్నారు. మానసిక స్థితిసరిగా లేక తనకుమారుడు ఉరివేసుకుని మృతి చెందాడని తల్లి ప్రమీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

ఆయన కళ్లు.. ఇద్దరికి చూపునిచ్చాయి..

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన సింగరేణి కార్మికుడు కాటిపెల్లి రాజ్‌కుమార్(38) శనివారం తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించడానికి అతడి నేత్రాలను కుటుంబ సభ్యులు దానంచేశారు. జీడీకే–1వ గనిలో జనరల్ మజ్దూర్‌గా పని చేస్తున్నాడు. 12వ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు బొడ్డు రవీందర్ విన్నపం మేరకు కుటుంబ సభ్యులు నేత్రాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, ప్రతినిధి కేఎస్‌వాసు ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్ నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు. మృతుడి తల్లి ప్రమీల, భార్య మహేశ్వరి, అక్కలు, బావలు స్వరూప–యుగేందర్, సరిత–శ్రీనివాస్, అనిత–సురేశ్, శ్రీలత–రమేశ్‌ను బొడ్డు రవీందర్‌తోపాటు సదాశయా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, ప్రతినిధులు నూక రమేశ్, కేఎస్ వాసు, రామగుండం లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తానిపర్తి విజయలక్ష్మి, బంక కళావతి, కోశాధికారి మనీషా అగర్వాల్ తదితరులు అభినందించారు.

మార్కెట్ ప్రహరీ కూల్చివేతకు యత్నం



గోడ కూల్చివేతకు ప్రయత్నిస్తున్న వ్యక్తి

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థలోని కూరగాయల మార్కెట్ ప్రహరీని గుర్తుతెలియని వ్యక్తులు శనివారం కూల్చివేయడానికి యత్నించారు. దీంతో స్థానికులు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నాగేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్.. వెంటనే టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రహరీ కూల్చివేతను అడ్డుకున్నారు. ప్రహరీ కూల్చివేస్తున్న ఫొటోలను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయడం చర్చనీయాంశమైంది. గోడ కూల్చివేత వివాదంపై బల్దియా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్



పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు

సుల్తానాబాద్(పెద్దపల్లి): జాతీయ క్రీడలకు పుట్టినిల్లు సుల్తానాబాద్ అని ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు అన్నారు. స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో అండర్ –17 బాల, బాలికలకు జిల్లాస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించాయ ఆయన మాట్లాడారు. క్రీడా పోటీలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కాగా, జిల్లావ్యాప్తంగా 95 జట్లు పాల్గొన్నాయి. టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోడెం అజయ్, కార్యదర్శి బోల్లి సత్యనారాయణ, పాఠశాల కరస్పాండెంట్ మాటేటి సంజీవ్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, సీనియర్ క్రీడాకారులు గాజుల రాజమల్లు, పల్లా సురేశ్, కోదాటి రాజకొమురయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ మీరూ లాయర్, ఇంజనీర్, ప్రొఫెసర్ కావాలనుకుంటున్నారా? LLB, B.Tech, M.Tech, M.Sc అగ్రి, MBA, Ph.D(All). Cont: 7013038197 (కొన్ని సీట్లు మాత్రమే) [W-1220937]

REAL ESTATE

FLAT FOR SALE

■ కరీంనగర్ భగత్‌నగర్‌లో మెగా రెసిడెన్సీలో ఫ్లాట్ అమ్మబడును. కబోర్డ్స్, సీలింగ్, కర్టెన్స్, కార్ పార్కింగ్ సౌకర్యం కలదు. సెల్: 7601073071 [K-1185660]

■ "0" Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

SERVICES

Finance Services

■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సివిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1220931]

BUSINESS OFFER

■ Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact : for more info: 9398743067 [H-193274]

■ We Are Ready to Invest Long Term Projects All over The World: + 91 8754809650. [HA7035]

WANTED

■ KNR, భగత్‌నగర్, SSS గణేష్ మీసేవలో పని చేయడానికి కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్నవారు M/F కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర॥ సెల్: 9652433414. [K-1185669]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [M-1221903]

■ రామకృష్ణ గ్రూపు, (TS No.1) HYD, VJA, శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, వంట/ఇంటిపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5వేలు కమీషన్. TS & AP అంతటా వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. ✆ 92814 52838, 82474 49036. [B-1206468]

■ ప్రముఖ బ్యాంకు DSAల యందు కాంట్రాక్టు పద్ధతిలో వర్క్ చేయడానికి M/F స్టాఫ్ అ.కా.ను. అ: ఇంటర్, డిగ్రీ జీ: 17K to 35K ఇంట్రెస్ట్ ఉన్న వారు వెంటనే డీటేల్స్ వాట్సాప్ చేయండి. 9885426966 [H-193239]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం: 18K Ph: 9848571888/9640400073 [H-189348]

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]

■ కరీంనగర్‌లో పనిచేయుటకు అనుభవం గల సెక్యూరిటీ గార్డ్స్, సూపర్‌వైజర్స్ Male / Female కావలెను. Ph: 7287960491. [W-1220939]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact: 9951602933, 9951602824

రైలులో మద్యం, పటిక స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

గోదావరిఖని/రామగుండం: మహారాష్ట్రలోని బల్లార్షా నుంచి రామగిరి రైలులో శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సుంకరి రమేశ్ శనివారం తెలిపారు. దేశీదారు(మహారాష్ట్ర మద్యం)తోపాటు గుడుంబా తయారీలో వినియోగించే ముడిపదార్థాలు పటిక తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈసందర్భంగా 155 బాటిళ్ల మద్యం, 150 కేజీల పటిక స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ రూ.50వేలు ఉంటుందన్నారు. మద్యం తరలించే వ్యక్తుల ఆచూకీ కనుగొనేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు శారద, విజయ్, సిబ్బంది ఖదీర్, ప్రసాద్, తిరుపతి, రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న రాసకొండ రవి

మంథని: మంథని ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు దుద్దిళ్ల శ్రీనుబాబుపై కమాన్‌పూర్ ఎంపీపీ రాసకొండ లక్ష్మి భర్త, బీఆర్ఎస్ నాయకుడు రాసకొండ రవి శనివారం మంథని రిటర్నింగ్ అధికారి హనుమా నాయక్‌కు ఫిర్యాదు చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తమకు డబ్బులు ఆశచూపి కాంగ్రెస్ పార్టీలో చేరి మద్దతు తెలపాలని కొద్దిరోజుల నుంచి ఫోన్ చేస్తున్నారని ఫిర్యాదు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ డబ్బు ఆశచూపుతున్న దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన తమ్ముడు శ్రీనుబాబుతోపాటు కరీంగనర్‌కు చెందిన ప్రసాద్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.



రోడ్డుపైనే చాంబర్లు.. రాకపోకలకు తిప్పలు

ఇది ఇరుకు రోడ్డు. దీపిగుండా కారు రాదు.. ఆటో వెళ్లలేదు.. టూవీలర్ రాకపోకలకూ కష్టమే అంటున్నారు వాహనదారులు, కాలనీవాసులు. అండర్ డ్రైనేజీ నిర్మించి ఏళ్లు గడుస్తున్నా రోడ్డు మరమ్మతు చేపట్టడంలేదు. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అసలే ఇరుకు రోడ్డు.. ఆపై డ్రైనేజీలపై ఏర్పాటు చేసిన చాంబర్లు.. గోదావరిఖని ప్రధాన చౌరస్తా సమీప కాలనీలోనిది ఈ దుస్థితి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి